# గచ్చిబౌలిలో మండల్ కమిషన్

■ కె. బాలగోపాల్

**మండల్ కమిషన్ సిఫారసులను అనుసరించి కేంద్ర ప్రభుత్వం చేసిన రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొన్ని సవరణలలో ఆమోదించిన తరువాత కేంద్ర ప్రభుత్వం 1997 సెప్టెంబర్ 3న ఒక ఆర్డర్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం క్రిందనున్న అన్ని పోస్టులలోనూ సర్వీసులలోనూ 27 శాతం బి.సి.లకు రిజర్వు చేయాలని దీని సారాంశం. ఏళ్ళు గడచినా దేశంలోని ఏ ఒక్క కేంద్ర విశ్వవిద్యాలయం లోను ఇది అమలుకావడం లేదు. బి.సి. రిజర్వేషన్లు అమలు చేయకుండా విద్యారంగ బ్యూరోక్రాట్లు అడ్డుపడుతున్న వైనాన్ని తెలుసుకోవాలంటే గచ్చిబౌలిలోని హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయాన్ని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు.**

మండల్ కమిషన్ గురించి పెత్తందారీ కులాల వాళ్లంతా ఎంత గగ్గోలు పెట్టారో మనకు బాగానే జ్ఞాపకం ఉంది. 'మండల్' అనేది ఆనాటి నుండి అసమర్థతను ప్రోత్సహించడానికీ, దేశాన్ని చీల్చడానికీ, పాక్షిక ప్రయోజనాల కోసం సార్వత్రిక ప్రయోజనాలను తాకట్టుపెట్టడానికీ పర్యాయపదంగా ఉంది.

ఎంత గొడవ పెట్టినా వారు రాజకీయంగా ఓడిపోక తప్పలేదు. కోర్టుకు పోయారుగానీ అక్కడ కూడా (కొన్ని ఒడిదుడుకులతో) సాంఘిక న్యాయానిదే విజయం అయింది. 'క్రీమీలేయర్'ను తొలగించాలని సుప్రీం కోర్టు నిర్విచక్షణగా చెప్పినప్పటికీ మొత్తం మీద రిజర్వేషన్లకు సంబంధించిన అనేక అంశాలలో అభినందించ దగ్గ సూత్రీకరణలే చేసింది.

కానీ ఆఖరి అస్త్రం బ్రాహ్మణీయ శక్తుల చేతులలో మిగిలే వుంది. వారు మండల్ కమిషన్ ద్వారా వచ్చిన రిజర్వేషన్ల అమలుకు అడ్డంపడ్డారు. విధాన నిర్ణయాలు చేసే రాజకీయ నాయకుల వ్యక్తిగత ఇష్టాయిష్టాలు ఎట్లాగున్నా వారు ఏదో ఒక మేరకు సమాజంలో మెజారిటీ ప్రజల ఒత్తిడికి లొంగక తప్పదు. ఆ నిర్ణయాల రాజ్యాంగ బద్ధతను బేరీజు వేసే న్యాయమూర్తులు వ్యక్తిగత అభిప్రాయాలు ఎట్లాగున్నా వారు ఏదో ఒక మేరకు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తలొగ్గక తప్పదు. ఏ ఒత్తిడిలేనిది కార్యనిర్వాహక శాఖకే. బ్యూరోక్రసీకి ప్రజల అభిప్రాయాలు పట్టించు కోవాల్సిన అగత్యం లేదు. రాజ్యాంగమంటే గౌరవం లేదు. 'కోర్టు ధిక్కారం' అంటూ న్యాయమూర్తులు అప్పుడప్పుడు వారిపైన కన్నెర్ర చేస్తుంటారుగానీ, అంతకంటే ఎక్కువేమీ చేయరని వారికి తెలుసును.

ముఖ్యంగా, విద్యారంగంలోకి మేధోబ్యూరోక్రాట్లు తాము దేనికీ జవాబుదార్లుకాని ఘనులమనుకుంటారు. వారికి సాంఘిక న్యాయమనే విలువ పట్ల ఉన్న చులకన భావం విద్యారంగానికొక పీడగా మారింది. ప్రభుత్వ విధానాలకూ రాజ్యాంగ సూత్రాలకూ భిన్నంగా నిర్ణయాలు తీసుకునే అధికారం తమకు లేదని వాళ్లు ఒప్పుకోరు. అవి అలగా జనం పెట్టే ఒత్తిడివల్ల అహేతుకమైన రూపం తీసుకున్నాయనీ హేతుబద్ధమైన ప్రయోజనాల రక్షణ చేయడం తమబోటి నిష్కామ కర్ములయిన బుద్ధి జీవులకే చెల్లుననీ అనుకుంటారు.

విద్యా రంగంలో మండల్ కమిషన్‌కు పట్టిన గతి దీనికొక ఉదాహరణ. జాతి ప్రయోజనాన్ని పట్టించుకోకుండా అడిగిన వాళ్లందరికీ రిజర్వేషన్లు ఇచ్చేస్తున్నారనీ, చేతకాని వాళ్లంతా రాజకీయ నాయకుల ఓట్ల దౌర్బల్యాన్ని అడ్డం పెట్టుకుని పైకి ఎగబాకి దేశాన్ని నాశనం చేస్తున్నారనీ వాపోయేవాళ్లు విద్యారంగాన్ని ఏలే బ్రాహ్మణీయ బ్యూరోక్రాట్లు ఆ ఒక్క రంగాన్ని మాత్రం ఆ ఉపద్రవం నుండి కాపాడారని చెప్తే సంతోషిస్తారేమో.


మండల్ కమిషన్ సిఫారసులను అనుసరించి కేంద్ర ప్రభుత్వం చేసిన రిజర్వేషన్లను సుప్రీం కోర్టు కొన్ని సవరణలతో ఆమోదించిన తరువాత, కేంద్ర ప్రభుత్వం 1993 సెప్టెంబర్ 8న ఒక ఆర్డర్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం కిందనున్న అన్ని పోస్టులలోనూ సర్వీసులలోనూ 27 శాతం బి.సిలకు రిజర్వు చేయాలని దీని సారాంశం.

ఏడేళ్లు గడిచినా దేశంలోని ఏ ఒక్క కేంద్ర విశ్వవిద్యాలయంలోనూ ఇది అమలు కావడం లేదని ఈ వ్యాసం సారాంశం.....

వేరే ఎవరికీ ఆ ఆర్డర్ భావమేమిటన్న సందేహం రాలేదుగానీ విద్యావేత్తలకే మొదట్లోనే సందేహం వచ్చిందంట. ఏమని సందేహమంటే, ఈ రిజర్వేషన్ ఉన్నతస్థాయి విద్యాసంస్థలకు కూడా వర్తిస్తుందా అని ఏదైనా ఒక పత్రంలో సందిగ్ధానికి తావు ఉంటే సందేహం రావచ్చునుగానీ ఏ సందిగ్ధానికీ తావులేని స్పష్టమైన భాషలో ఉన్న బి.సి రిజర్వేషన్ ఆర్డర్ గురించి సందేహమెందుకు రావాలి?

ఏమయితేనేం వచ్చింది. దానికి కేంద్ర ప్రభుత్వం జవాబు కూడా ఇచ్చింది. ఈ రకమైన సందేహం కొంతమంది వ్యక్తం చేస్తున్నారని చెప్తూ, కేంద్ర ప్రభుత్వం కిందనున్న సంస్థలే కాబట్టి వాటికి కూడా 1993 సెప్టెంబర్ 8 నాటి రిజర్వేషన్ ఆర్డర్ వర్తిస్తుందని చెప్తూ 1994 డిసెంబర్ 13న ఒక సర్క్యులర్ జారీ చేసింది.

అక్కడితో సందేహం తీరి ఉండేది కానీ అది సందేహమయితేగా తీరడానికి? అది అభ్యంతరం. అందువల్ల అది తీరదు. కేంద్ర ప్రభుత్వం



విషయాన్ని స్పష్టం చేసిన తరువాత కూడా విద్యారంగ బ్యూరో క్రాట్లు కేంద్ర విద్యా సంస్థలలో బి.సి రిజర్వేషన్ను అమలు చేయకుండా తప్పించుకున్న వైనాన్ని తెలుసుకోవాలంటే గచ్చిబౌలిలోని హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయాన్ని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు.

ఆ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బి.సి కులస్తులు పెట్టిన ఒత్తిడి ఫలితంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి బి.సిలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడం జరుగుతుందని 1994 జూన్ 23న హైదరాబాద్ యూనివర్సిటీ పాలనా మండలి ఒక తీర్మానం చేసింది. ఆ విషయాన్ని ఆగస్టు 2న నోటిస్పై చేసింది కూడా.

కానీ మళ్లీ ఏ కారణంగానో 'సందేహం' తలెత్తినట్టుంది. 1994 నవంబర్ 26న హైదరాబాద్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ యు.జి.సికి ఒక ఉత్తరం రాసి తమ సందేహాన్ని తీర్చమన్నాడు. ఇటువంటి సందేహాలను దృష్టిలో ఉంచుకునే, అదే సంవత్సరం డిసెంబర్ 13న కేంద్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్ జారీ చేసిన సంగతి పైన చూశాం. కానీ హైదరాబాద్ విశ్వవిద్యాలయం పాలనా మండలి దానిని పట్టించుకోదలచుకోలేదు. యు.జి.సి చేసే విధాన నిర్ణయాలు తమకు శిరోధార్యం కాబట్టి యు.జి.సి నుండి జవాబు రావాలని పట్టుబట్టారు. శంఖంలో పోస్తే తప్ప అది తీర్థం కాదని నమ్మే సంస్కృతికి వారసులు కదా మరి!

యుజిసి ప్రవర్తన ఇంకా విచిత్రంగా ఉంది. నిజానికి రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్న తరువాత దానితో విభేదించే అధికారం యుజిసికి లేదు. జాతీయ విధానాలకు సంబంధించిన ఏ విషయంలోనైనా యుజిసి కేంద్ర ప్రభుత్వం జారీచేసే ఆదేశాలకు లోబడి వ్యవహరించాలని యుజిసి చట్టంలోని సెక్షన్ 20 అంటుంది. అయినప్పటికీ 1994 డిసెంబర్ 13న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ను యుజిసి పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఏ విషయం తేల్చి చెప్పేదాకా వేచి చూడమనీ ఆ లోపల లెక్చరర్ పోస్టులు నింపవద్దనీ హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి 1995 ఆగస్ట్ 3న ఉత్తరం రాసింది!

అయితే లెక్చరర్ పోస్టులు నింపకుండా ఉంటే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుంది కాబట్టి హైదరాబాద్ యూనివర్సిటీ యుజిసి జారీ చేసిన 'స్టే'ని లెక్క చేయకుండా లెక్చరర్ పోస్టులు నింపుతూనే వుంది. మరి బి.సి రిజర్వేషన్ మాట ఏమిటని ఎవరైనా అడిగితే మళ్లీ యుజిసికి ఒక ఉత్తరం రాస్తుంది. యుజిసి పాత పద్ధతిలోనే 'కేంద్రం నిర్ణయం కోసం నేనుకూడా ఎదురుచూస్తున్నాను. నువ్వూ ఎదురు చూడు' అంటుంది. ఆరేళ్ల కింద కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సందేహాలనే ప్రస్తావిస్తూ ప్రకటించిన నిర్ణయం 'ఇంకా రాలేదు, ఇంకా రాలేదు' అంటూ హైదరాబాద్ విశ్వవిద్యాలయం పెద్దలూ యుజిసి పెద్దలూ ఎదురుచూస్తూనే ఉన్నారు. ఈ లోపల 'తమ వారికి' ఉద్యోగాలు కట్టబెడుతూనే వున్నారు. వారు 'ప్రతిభావంతులు' కారండీ మరి!

కిందటి సంవత్సరం హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఒకేసారి 52 లెక్చరర్ల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఎప్పటిలాగే అందులో బి.సిలకు రిజర్వేషన్ లేదని చూసి ఇ.వెంకటేశు, మురళి అనే ఇద్దరు బి.సి విద్యార్థులు, యూనివర్సిటీ బి.సి ఉద్యోగుల సంఘం కలిసి హైకోర్టులో కేసు వేశారు. పైన వివరించిన విషయాలన్నీ హైకోర్టుకు చెప్పారు. 1994లోనే కేంద్రం స్పష్టం చేసిన తరువాత యుజిసి ఇంకా 'తన అభిప్రాయం యూనివర్సిటీకి తెలియజెప్పకుండా దాటవేయడంలో అర్థంలేదంటూ నాలుగు వారాలలో నీ సూచన హైదరాబాద్ యూనివర్సిటీకి తెలియజేయ'మని హైకోర్టు యుజిసికి ఈ సంవత్సరం జులై 7న ఆర్డర్ జారీ చేసింది. నాలుగు వారాలంటే ఒక నెల. మూడు నెలలు అయినా యుజిసి నుండి ఉలుకూపలుకూ లేకపోయే సరికి

**వేరే ఎవరికీ ఆ ఆర్డర్ భావమేమిటన్న సందేహం రాలేదు గానీ విద్యావేత్తలకే మొదట్లోనే సందేహం వచ్చిందంట. ఏమని సందేహమంటే, ఈ రిజర్వేషన్ ఉన్నతస్థాయి విద్యాసంస్థలకుకూడా వర్తిస్తుందా అని ఏదైనా ఒక పత్రంలో సందిగ్ధానికి తావు ఉంటే సందేహం రావచ్చును గానీ ఏ సందిగ్ధానికీ తావులేని స్పష్టమైన భాషలో ఉన్న బి.సి రిజర్వేషన్ ఆర్డర్ గురించి సందేహమెందుకు రావాలి?**

ఏమయిందని హైకోర్టు యుజిసిని అడుగగా, మళ్లీ కేంద్ర ప్రభుత్వానికి రాశాననీ వారి నుండి జవాబు రావాలనీ యుజిసి ఛైర్మన్ అన్నారు. వారి వైఖరిని అర్థం చేసుకున్న హైకోర్టు ఆ మహానుభావుడిని డిసెంబర్ 28న హైదరాబాద్ వచ్చి తన ముఖం చూపించమని శాసించింది.

వస్తాడో రాడో, ఇప్పుడింకా ఏం సంజాయిషీ వండుకొస్తాడో వేచి చూడవలసిందే. కానీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన ఆదేశాలు సహితం అమలుకావడం చాలా కష్టమన్న అభిప్రాయాన్ని ప్రకటించడానికి ఇంకా వేచి చూడవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. ■

## బి.సి అడ్వకేట్లూ.... ఒక మాట !

బి.సి అడ్వకేట్లు తమ వృత్తిని మెరుగుపర్చుకోవడానికి, న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకోవడానికి వీలుగ బి.సి సంక్షేమశాఖ ప్రతి సంవత్సరం అడ్వకేట్లకి ఆర్థిక సహాయం అందిస్తోంది. వీరికి ఎన్‌రోల్‌మెంట్ కోసం రూ.585/-లు, పుస్తకాలకు, ఫర్నీచర్‌కు రూ. 3,000/-లు సమకూర్చుతోంది. అలాగే శిక్షణా కాలంలో మూడు సంవత్సరాలపాటు రూ. 500/- చొప్పున స్టయిఫండ్ మంజూరు చేస్తోంది. ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం 2000-2001 సంవత్సరపు బడ్జెట్‌లో 10 లక్షలు సమకూర్చాలని నిర్ణయించింది.

ఈ కార్యక్రమం క్రింద ఎంపికైన అభ్యర్థులకు జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు లేదా హైదరాబాద్‌లోని హైకోర్టు అడ్వకేట్ జనరల్‌కు, ప్రభుత్వ ప్లీడర్లకు అనుబంధిస్తారు. వారు ఈ అభ్యర్థులకు న్యాయ పరిపాలనలో శిక్షణ ఇస్తారు. ఇందుకు నమ్మతమైతే ఈ పథకాన్ని అడ్వకేట్లు ఉపయోగించుకోవచ్చు.

కాకపోతే గత ఐదు సంవత్సరాలుగా ఈ పథకాన్ని సరిగ్గా అమలు చేయడం లేదు. ఈ పథకంలో భాగంగా సెలక్టయిన వారికి స్టయిఫండ్ ఇవ్వకుండా ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. ప్రతి ఏటా బడ్జెట్ కేటాయిస్తోంది, ఆ బడ్జెట్ అసెంబ్లీలో పాసైనప్పటికీ ఖర్చు పెట్టకుండా ఈ పథకాన్ని నిష్ప్రయోజనంగా మారుస్తున్నారు. ఈ సంవత్సరం బడ్జెట్‌ను అదే రీతిలో నిర్వీర్యం చేయకుండా న్యాయవాదులు ఒత్తిడి తెస్తే మరీమంచిది. ■